క్లుప్తంగా

17న మండల పరిషత్ సమావేశం

కపిలేశ్వరపురం: మండల సర్వ సభ్య సమావేశం ఈనెల 17న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో ప్రభుత్వ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సకాలంలో హాజరుకావాలని ఆదేశించినట్టు ఎంపీడీఓ తెలిపారు.

లయన్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయం


దుప్పట్లు అందజేస్తున్న డాక్టర్ ఉమానందిని, క్లబ్ సభ్యులు

మండపేట: పేదల కోసం లయన్స్‌క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని మండపేట ప్రభుత్వ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమానందిని అన్నారు. లయన్స్‌క్లబ్ సభ్యుడు జొన్నల వెంకటేశ్వరరావు సౌజన్యంతో సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో 50 మంది లెప్రసీ వ్యాధిగ్రస్తులకు డాక్టర్ ఉమానందిని చేతుల మీదుగా దుప్పట్లు, బ్రెడ్ అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు గుండు వీరతాతరాజు పేదలకు చేయూతను అందించడంలో తమ క్లబ్ ఎప్పుడు ముందుంటుందన్నారు. డాక్టర్ అస్మాఅక్తర్, క్లబ్ సభ్యులు చెన్న రాంబాబు, కురసాల సత్యనారాయణ, పారా మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్లకు పరామర్శ

మండపేట: ఇటీవల కాలికి గాయమై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును సోమవారం పలువురు పరామర్శించారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందం, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని తదితరులు ఎమ్మెల్యే వేగుళ్లను కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు

కాజులూరు: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఈ నెల 15, 17వ తేదీల్లో కళాశాలలో జరుగనున్న పరీక్షలకు తప్పని సరిగా హాజరు కావాలని పిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నైతిక, మానవతా విలువలు(ఎతిక్స్ అండ్ హ్యూమన్ వాల్యుస్) అనే సబ్‌జెక్ట్‌పైనా, 17వ తేదీ ఉదయం 10 గంటల నుంచి పర్యావరణ విద్య (ఎన్విరాన్మేటల్ ఎడ్యుకేషన్) అనే సబ్‌జెక్ట్ పైనా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఈ పరీక్షలకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలని, లేకుంటే మార్చి 15వ తేదీ నుంచి జరుగు పబ్లిక్ పరీక్షకు అనుమతి ఉండదన్నారు.

17 లోపు ఈక్రాప్, ఈకేవైసీ నమోదు చేసుకోవాలి

రామచంద్రపురం రూరల్: మండలంలోని రైతులందరూ ఈ నెల 17వ తేదీ లోపు ఈక్రాప్, ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అన్ని రైతు భరోసా కేంద్రాల్లోనూ గ్రామ వ్యవసాయ సహాయకులు నమోదు చేయడానికి అందుబాటులో ఉంటారన్నారు.

కొనసాగుతున్న మహా రుద్రయాగం

రాయవరం: సోమేశ్వరంలోని చారిత్రక బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో పంచాయతన మహా రుద్ర యాగం రెండో రోజు సోమవారం కొనసాగింది. ఈ నెల 23వ తేదీ వరకూ 12 రోజుల పాటు మహా రుద్రయాగం కొనసాగనున్న విషయం పాఠకులకు విదితమే. బ్రహ్మశ్రీ చంద్రాభట్ల రఘురామశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు జరుగుతున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి రుద్రయాగంలో పాల్గొన్నారు. వారికి అన్న సమారాధన నిర్వహించారు.

దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు, ప్లేట్లు అందిస్తున్న వీరభద్రుడు

రామచంద్రపురం: పట్టణంలోని ప్రసన్న విఘ్నేశ్వర కల్యాణ మండపం వద్ద జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'స్పర్శ' కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. ప్రసన్న విఘ్నేశ్వరా సంస్థల అధినేత, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో 55 మందికి వాటిని అందజేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం ఉపాధ్యక్షుడు కొవ్వూరి త్రినాథ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిరిపురపు శ్రీనివాసు, రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరభద్రుడు, డీపీఎంఓలు మాధవరపు వెంకటేశ్వర్లు, ఎస్.సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు నిల్.. సేవలు ఫుల్

- సర్కారు ఆసుపత్రిలో మెరుగైన సేవలు
- 300లకు పైగా నమోదవుతున్న ఓపీ
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు కృతజ్ఞతలు


వైద్యసేవల కోసం వచ్చిన మహిళలు

మండపేట: పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పట్టణంతో పాటు చుట్టు పక్కల 20 గ్రామాలకు కేంద్రంగా ఉన్న మండపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పలు వైద్యుల పోస్టుల భర్తీతో రోగులకు నాణ్యమైన సేవలు అందుతున్నాయి. రోగుల సంఖ్య పెరగడంతో ఓపీ 300 వరకు నమోదవుతోంది.

మండపేట ప్రభుత్వ ఆస్పత్రికి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు. గైనిక్ కేసులు అధికంగా వస్తుంటాయి. 30 పడకల ఆస్పత్రి కావడంతో ఎనిమిది వైద్యులు విధులు నిర్వర్తించాల్సి ఉంది. పూర్తి స్థాయిలో నర్సులు, ఇతర సిబ్బంది ఉన్నప్పటికీ బదిలీలు, డిప్యుటేషన్ తదితర కారణాలతో గతంలో ముగ్గురు వైద్యులు మాత్రమే విధులు నిర్వర్తించేవారు. వైద్యులపై పని భారం ఎక్కువగా ఉండడంతో పాటు స్పెషలిస్ట్ వైద్యులు లేక రోగులు ఇబ్బందులు పడాల్సి వచ్చేది.

ప్రభుత్వ ఆస్పత్రిపై ప్రత్యేక దృష్టి

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపే ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆస్పత్రి అభివృద్ధిపై దృష్టిసారించారు. వైద్యుల కొరతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ముగ్గురు స్పెషలిస్ట్ డాక్టర్లు ఇక్కడ విధుల్లో చేరారు. గైనిక్, చిన్నపిల్లలు, జనరల్, డెంటల్, సర్జన్ స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులోకి రావడంతో సేవలు మరింత మెరుగయ్యాయి. అవసరమైన వారందరికీ డెంగీ, టైఫాయిడ్, మలేరియా తదితర రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. గతంలో ఆయా పరీక్షలకు సంబంధించిన కిట్లు అందుబాటులో లేక అధికశాతం మంది ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వచ్చేది. ఇప్పుడు అవసరమైన కిట్లు అందుబాటులో ఉంచడంపై రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో ఎక్సరే సేవలు గత ఏడాది అందుబాటులోకి తెచ్చారు. జనవరిలో 410 మందికి ఎక్సరేలు తీశారు. గతంలో అనపర్తి, ఆలమూరు, కపిలేశ్వరపురం తదితర చుట్టుపక్కల ప్రభుత్వ ఆస్పత్రుల్లో గైనిక్ ఆపరేషన్లు చేసేవారు లేక గర్భిణులను మండపేట ఆస్పత్రికి తీసుకువచ్చేవారని, ఇప్పుడు ఆయా చోట్ల డెలివరీలు చేస్తున్నప్పటికి మండపేట వస్తున్న వారి సంఖ్య అధికంగానే ఉంటోందని స్థానికులు అంటున్నారు. గత నెలలో 28 డెలివరీలు చేయగా వీటిలో నార్మల్ డెలివరీలు 17 ఉన్నాయి. అలాగే 24 మందికి టూబెక్టమీ ఆపరేషన్లు నిర్వహించారు. గతంతో పోలిస్తే వైద్యసేవలు ఎంతో మెరుగుపడ్డాయని స్థానికులు అంటున్నారు. సాధారణ రోజుల్లో ఓపీ 250 నుంచి 300 వరకు ఉండగా, సోమ, బుధవారాల్లో 300 దాటుతోందని సిబ్బంది తెలిపారు.

కృతజ్ఞతలు



ఆస్పత్రిలో ఆరుగురు వైద్యులు అందుబాటులో ఉన్నారు. గైనిక్, జనరల్, చిన్నపిల్లలు, డెంటల్, సర్జన్ ఇలా స్పెషలిస్ట్ వైద్యుల ఉండటంతో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. ఖాళీ పోస్టుల భర్తీకి కృషి చేసిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు.

– డాక్టర్ ఉమానందిని, ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్

సేవలు బాగున్నాయి..



ఆస్పత్రిలో రోగులను డాక్టరమ్మలు చాలా బాగా చూస్తున్నారు. మా అమ్మాయికి ఇక్కడే పురుడు పోయించాను. రక్త పరీక్షలకు బయటకు వెళ్లాల్సిన పని లేకుండా అన్ని ఇక్కడే చేశారు. అన్ని సేవలు ఉచితంగా అందించారు. బయట ఆస్పత్రికి వెళితే చాలా డబ్బులు అయిపోయుండేవి.

– వెంకటలక్ష్మి, ఏడిద

ప్రేమను గెలిపించుకున్నారు..

రాయవరం: రెండు హృదయాలను ఒక్కటి చేసేది ప్రేమ. ఆ రెండు మనసులు ఎన్నో ఆశలతో జీవతం అనే నావలో ప్రయనిస్తూ కుటుంబంతో ఆనందంగా ఉంచేలా చేసేది ప్రేమ. ఈ ప్రేమికులు ఏటా ఫిబ్రవరి 14న వేడుకలు జరుపుకొంటారు. మంగళవారం ప్రేమికుల రోజు సందర్భంగా ఒకరి ప్రేమను మరొకరు గెలుచుకుని, వివాహం చేసుకున్న వారి అభిప్రాయం..



స్నేహితుని వివాహానికి మండపేట వెళ్లాను. అక్కడ ఆమెను చూశాను. ప్రేమిస్తున్నానని చెప్పాను. కులాలు వేరు కావడంతో తొలుత పెద్దలు అంగీకరించరేమోనని భయం వేసింది. కాని ఇరువైపులా తల్లిదండ్రులు అంగీకరించడంతో మా ప్రేమను పండించుకున్నాం. 2021 మే 2న వివాహం చేసుకున్నాం. వివాహమైనప్పటి నుంచి నేటి వరకు మా దాంపత్యంలో ఏ రోజు కలతలు తొంగి చూడలేదు. మా ప్రేమకు ప్రతి రూపంగా బాబు ఆదర్శకార్తికేయ పుట్టాడు. నా పుట్టిన రోజునే పండంటి బిడ్డను ఇవ్వడం నాకు మరింత సంతోషాన్నిచ్చింది.

– బొంతు వంశీధర్, పావని దంపతులు, రాయవరం

విష జ్వరాలపై ఆందోళన వద్దు

- మాచర గ్రామంలో పర్యటించిన ఎంపీడీఓ, తహసీల్దార్
- జ్వరపీడితులు ఐదుగురు మాత్రమే
- ప్రత్యేక పారిశుధ్య చర్యలు కొనసాగింపు
- వారం రోజులపాటు మెడికల్ క్యాంపు నిర్వహణ


పరిస్థితిని సమీక్షిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ సూర్యారావు, సర్పంచ్ సునీత

కపిలేశ్వరపురం: మాచర గ్రామంలో వందల సంఖ్యలో జ్వరపీడితులున్నారంటూ సోషల్ మీడియా, యూట్యూబ్ చానళ్లలో వచ్చిన వార్తలు నేపథ్యంలో గ్రామస్తులు ఆందోళన చెందవద్దని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యులు చిట్టూరి రాకేష్ చౌదరి తెలిపారు. మాచరలో విష జ్వరాలు ప్రబలాయి అన్న వార్తలపై వారంతా సోమవారం గ్రామంలో పర్యటించారు. సర్పంచ్ వాసంశెట్టి సునీత మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య ఆరోగ్య అనుబంధ శాఖలు అప్రమత్తమై కృషి చేస్తున్నారని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యులు రాకేష్ చౌదరి మాట్లాడుతూ వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ఇంటింటి ఫీవర్ సర్వే చేయగా ఐదుగురు జ్వరాలతో బాధ పడుతున్నారని తేలిందన్నారు. వారికి రక్త పరీక్షలు చేయగా టైఫాయిడ్ జ్వరాలుగా నిర్ధారణ అయ్యిందని, వారిలో ఇద్దరికి డెంగీ అనుమానిత లక్షణాలున్నాయని గుర్తించామని తెలిపారు. వారికి మెరుగైన పరీక్షలు చేస్తామన్నారు. జ్వరాలపై అప్రమత్తమై ఉన్నతాధికారుల ఆదేశాలపై గ్రామంలో ప్రత్యేక మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. గ్రామానికి చెందిన ఓ మహిళ ఈ నెల 9న జ్వరం రావడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చేరగా చికిత్స పొందుతూ రెండు రోజులు తర్వాత మృతి చెందారన్నారు. డెంగీ జ్వరంగా నిర్ధారణ చేసేందుకు ఎలీషా పరీక్ష చేయాల్సి ఉంటుందన్నారు. అది ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా చేస్తామన్నారు. జ్వరం వచ్చినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించడం ద్వారా పూర్తి స్థాయి పరీక్షలు చేసి శాస్త్రీయ పద్ధతిలో నిర్ధారణకు వచ్చేందుకు వీలుంటుందన్నారు. అనుమానం ఉన్న గ్రామస్తులు వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యులను, స్థానిక వైద్య ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలన్నారు. గ్రామ కార్యదర్శి చినబాబు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి నెలా ప్రణాళికాబద్ధంగా పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం గ్రామంలో డ్రెయిన్లలో పూడికను తొలగించామని, ఫాగింగ్ యంత్రంతో దోమల నివారణ చర్యలు చేపట్టామన్నారు.

మరింత బాధ్యతగా పనిచేస్తా

అముజూరు గ్రామ సర్పంచ్ కల్యాణి


కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ కల్యాణి

కె.గంగవరం: గ్రామ సర్పంచ్‌గా మరింత బాధ్యతతో గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకుంటానని అముజూరు గ్రామ సర్పంచ్ నానాపరవు కల్యాణి అన్నారు. సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టి నేటితో రెండేళ్లు పూర్తి అవ్వడంతో గ్రామ సచివాలయం వద్ద సోమవారం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గడచిన రెండేళ్లలో గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను తెలిపారు. గ్రామ పెద్దలు పెంకే రవిచంద్ర, మేడిశెట్టి శ్రీనివాస్, గెద్దాడ సతీష్ కార్యదర్శి శీతారామయ్య చౌదిరి, వీఆర్‌ఓ పట్టాబి రామారావు, వార్డులు సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సూర్యనారాయణకు సత్కారం


సూర్యనారాయణ తదితరులను సత్కరిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

మండపేట: బాలికల భవిత కోసం తపాలశాఖ ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజన పథకంలో అధికశాతం మందిని భాగస్వాములు చేసేందుకు మండపేట పోస్టల్ అసిస్టెంట్ కొండపల్లి సూర్యనారాయణ చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు పోస్టల్ ఉద్యోగులు పేర్కొన్నారు. సుకన్య సమృద్ధి యోజన స్పెషల్ డ్రైవ్‌లో మండపేట పోస్టాఫీసును ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొదటిస్థానంలో నిలపడంపై సూర్యనారాయణను సోమవారం సహచర ఉద్యోగులు పోస్టాఫీసులో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సబ్‌పోస్టుమాస్టర్ ఎస్.శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ పోస్టుమాస్టర్ టపా పుల్లేశ్వరరావు మాట్లాడారు. పోస్టల్ ఉద్యోగులు కేవీ నారాయణరావు, ఎండీ షరీఫ్, కె.ఈశ్వరరావు, వి.గోవింద్, కె.జానకి, సీహెచ్ శ్రీనివాస్, సిద్ధిరెడ్డి దుర్గాభవాని, కె.అనూష, అనూష, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పగలు వేడి.. రాత్రి చలి..


గొల్లపాలెంలో ఉదయం ఎనిమిదైనా వీడని మంచు తెరలు

కాజులూరు: తొలి సంధ్య వేళలో మంచు వర్షం, ఆ తరువాత భానుడి ప్రతాపం, మలి సంధ్య కాగానే చలి చంపేస్తోంది. ఇలా విభిన్న వాతావరణంలో కొద్దిరోజులుగా పల్లె ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నిన్న, మొన్నటి వరకూ చలిగుప్పెట్లో అల్లాడిన ప్రజలకు ఒక్కసారిగా పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. కాజులూరు మండల గ్రామాల్లో రాత్రుళ్ళు చలితోపాటు ఉదయం ఎనిమిది గంటల వరకూ మంచు తెరలు వీడడం లేదు. ఆపై 10 గంటల నుంచి ఎండ పోరలు ప్రసరిల్లుతూ మధ్యాహ్నం అయ్యే సరికి భానుడు ఉగ్ర ప్రతాపాన్ని చూపుతున్నాడు. గత నెల 28న జరిగిన రథసప్తమి రోజున సూర్యభగవానుడు కొత్త రథాలను సిద్ధం చేసుకుని తన పయనాన్ని ప్రారంభిస్తాడని ఆ రోజు నుంచే వేసవి ప్రారంభమవుతుందని హైందవ భక్తుల నమ్మకం. దానికనుగుణంగానే వేసవిలో వచ్చేసిందంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. అయితే రాత్రి పూట చలి ఉదయం మంచు తగ్గకపోవడంతో విభిన్న వాతావరణాల వల్ల ఆరోగ్య పరంగా ఇబ్బంది పడుతున్నామని ప్రజలు చెబుతున్నారు. మంచు వల్ల పంటలకు కూడా తెగుళ్లు సోకే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఈ నెల 18న మహాశివరాత్రితో చలి శివా లుమంటూ పోతుందని అప్పటి నుంచి చలి తగ్గి వేడిగా ఉంటుందని పలువురు అంటున్నారు. ఏదిఏమైన ఈ ఏడాది ఫిబ్రవరి నెల సగం రోజులు కూడా పూర్తవ్వకుండానే పగలు ఎండ ఇలా ఉంటే మున్ముందు వేసవిలో ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళనలు చెందుతున్నారు.

మోటారుసైకిల్ చోరీపై కేసు

మండపేట: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో పార్క్ చేసిన మోటారుసైకిల్ చోరీకి గురైన ఘటనపై సోమవారం రాత్రి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఐడీఎఫ్‌సీ బ్యాంకులో పని చేస్తున్న వై.మల్లేశ్వరప్రసాద్ గత ఏడాది డిసెంబర్ 30న తన మోటారుసైకిల్‌ను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో పార్కింగ్ చేశారు. పని ముగించుకుని వచ్చి చూసే సరికి బైక్ లేదు. చుట్టుపక్కల గాలించిన ఫలితం లేకపోవడంతో బాధితుడు ఫిర్యాదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

మండపేట: లారీ ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటనపై సోమవారం రాత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గోకవరం మండలం మల్లవరానికి చెందిన ఎం.శ్రీను మండపేటలో తన స్నేహితుడి కుమార్తె వివాహం నిమిత్తం మరో స్నేహితుడు సత్తిబాబుతో కలిసి మోటారుసైకిల్‌పై వచ్చాడు. తిరుగు పయనంలో పెదకాలువ వంతెన వద్ద లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీను కాలికి బలమైన గాయాలైనట్టు పోలీసులు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల కార్మికవ్యవస్థను నిర్మూలిద్దాం

పెదపూడి: వెట్టిచాకిరి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని పెదపూడి ఎస్సై పి.వాసు తెలిపారు. ఆయన మండలంలో 18 గ్రామాల్లో షాపులు, రైసుమిల్లులు, వివిధ పరిశ్రమలు, హోటళ్లు తదితర వాటిలో వెట్టిచాకిరి, బాలిక కార్మిక నిర్మూలన వ్యవస్థపై అవగాహన కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు, షాపుల్లో చిన్నారులతో చాకిరి చేయిస్తే వారిపై నిబంధనలు ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 14 సంవత్సరాల్లోపు చిన్నారులతో పనులు చేయించొద్దన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు

కాజులూరు: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఈ నెల 15, 17వ తేదీల్లో కళాశాలలో జరుగనున్న పరీక్షలకు తప్పని సరిగా హాజరు కావాలని పిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కళాశాలలో ఆయన విలేకురులతో మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నైతిక, మానవతా విలువలు(ఎతిక్స్ అండ్ హ్యూమన్ వాల్యుస్) అనే సబ్‌జెక్ట్‌పైనా, 17వ తేదీ ఉదయం 10 గంటల నుంచి పర్యావరణ విద్య (ఎన్విరాన్మేటల్ ఎడ్యుకేషన్) అనే సబ్‌జెక్ట్‌పైనా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఈ పరీక్షలకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలని, లేకుంటే మార్చి 15వ తేదీ నుంచి జరుగు పబ్లిక్ పరీక్షకు అనుమతి ఉండదన్నారు.

వైభవంగా వీరభద్రుని సంబరం


పట్టణ ప్రధాన రహదారిపై వీరభద్రస్వామి ఊరేగింపు


వీరగని కమ్మల ప్రతిమలతో ఊరేగుతున్న భక్తులు

రామచంద్రపురం: పట్టణంలో వీరభద్రస్వామి సంబరం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కుమ్మర్ల వీధి పెద్దగద్దె నుంచి సుమారు 5 వేల మందికి పైగా భక్తులు వీరభద్రస్వామి, వీరగని కమ్మల ప్రతిమలను శిరస్సున ధరించి పట్టణ ప్రధాన రహదారిపై భారీ ఊరేగింపు నిర్వహించారు. కేరళ, మంగళ వాయిద్యాలతో ఊరేగింపు కన్నుల పండుగగా కొనసాగింది. అనంతరం జమ్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, తిరిగి పెద్దగద్దెకి వీరభద్రస్వామి, వీరగనికమ్మలను అప్పగించారు. తెల్లవారు జామున 4.30 గంటలకు ప్రారంభించిన కార్యక్రమం రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. రామచంద్రపురం సీఐ దుర్గారావు ఆధ్వర్యంలోరామచంద్రపురం ఎస్సై సురేష్‌బాబు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

పుట్టకొండ లక్ష్మీనరసింహుని హుండీ ఆదాయం రూ. 1,25,018


పెదపూడి: పుట్టకొండ గ్రామంలో ప్రసిద్ధి చెందిన లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక హుండీ ఆదాయం రూ.1,25,018 వచ్చిందని ఆలయ ఈఓ సీహెచ్‌వీ రమణమూర్తి తెలిపారు. ఆలయంలో స్వామి వారి హుండీ ఆదాయం లెక్కింపు దేవదాయ ధర్మదాయశాఖ కాకినాడ ఇన్‌స్పెక్టర్ ఫణి పర్యవేక్షణలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ సీహెచ్‌వీ రమణమూర్తి మాట్లాడుతూ గతేడాది మార్చి 10 నుంచి నేటి వరకూ గల హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహించామన్నారు. గతేడాది కంటే ఆదాయం పెరిగినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పెదపూడి గ్రూప్ ఆలయాల ఈఓ వడ్డాది సత్యనారాయణ, గ్రామ సర్పంచి వల్లు వెంకటరమణ, ఉపసర్పంచి ఎం.శ్రీను పాల్గొన్నారు.


'స్నో'యగం

రాయవరం: పగటి పూట భానుడి భగభగలు.. రాత్రి వేళ చలి పులి పంజా వేసురుతోంది. ఈ మాఘమాసంలో మంచు దుప్పటి పరచుకుంది. సోమవారం ఉదయం ఎనిమిది గంటలైనా.. దట్టమైన మంచు వీడిపోలేదు. అంతటా 'స్నో'యగం పరుచుకుంది. ఇంతటి చలిలో కూడా ప్రజలు తమ దైనందిన కార్యక్రమాలను వీడలేదు. మంచు నుంచి తప్పించుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రయాణం చేశారు. మంచు దట్టంగా పరుచుకోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ దృశ్యాలు రాయవరంలో చేటు చేసుకున్నాయి.


రాయవరంలో 7 గంటలకు పరుచుకున్న మంచుదుప్పటి


మంచు తెరల మధ్య మైదానంలో ఆటలు ఆడుతున్న యువకులు


దట్టమైన మంచును సైతం లెక్క చేయకుండా వెళుతున్న కూలీలు


ఉదయం 7 గంటల సమయంలో లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్న వాహనాలు

అక్రమ బియ్యం పట్టివేత

బిక్కవోలు: ఆర్ఎస్ పేట బ్రిడ్జి వద్ద అక్రమంగా రవాణా అవుతున్న పీడీఎస్ బియ్యాన్ని ఎస్సై పి.బుజ్జిబాబు పట్టుకున్నారు. సోమవారం వాహనాల తనిఖీ చేస్తుండగా నల్లమిల్లి నుంచి వ్యాన్ నుంచి 2,890కిలోల బియ్యం తరలిస్తుండడంతో ఇద్దరు వ్యక్తులు అదుపులోకి తీసుకుని, బియ్యం లోడ్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు.

భక్తుల భిక్షాటన

బిక్కవోలు: బలభద్రపురంలోని సాయిబాబా ఆలయం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మాలధారణ చేసిన స్వాములు భిక్షాటన చేశారు. మాలధరించిన భక్తులు ఆదివారం, సోమవారం గ్రామంలోని భిక్షాటన చేయడం ద్వారా 4 క్వింటాళ్ల బియ్యం , రూ.72,000 నగదు లభించిందని, వాటితో 17న అన్నదానం చేయనున్నట్టు ఆలయం వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు సత్తి సుబ్బారెడ్డి తెలిపారు.

సంకల్పమే యువత ఆయుధం

అనపర్తి: స్వామి వివేకానందుని బోధనల స్ఫూర్తితో యువత మనో సంకల్పాన్ని ఆయుధంగా చేసుకుని ముందుకుసాగాలని రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం మేనేజర్ స్వామి రఘువీరానందజీ మహారాజ్ అన్నారు. స్థానిక రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జీబీఆర్ విద్యాసంస్థల సెమినార్ హాలులో జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్వామీజీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సతిమణి సత్తి ఆదిలక్ష్మి మాట్లాడుతూ మనిషి సమగ్ర జీవన విధానాన్ని నేర్పించిన స్వామీజీ సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాలని, సమాజంలో యువత జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సమితి ఉపాధ్యక్షుడు సత్తి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాస ఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్ తేతలి కృష్ణారెడ్డి, సమితి సభ్యులు పాల్గొన్నారు.